విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: నాడు - నేడు నిధులను సకాలంలో ఖర్చు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నాడు నేడులో చేపట్టిన పాఠశాలల మౌలిక వసతులు ఏర్పాటు, అదనపు గదులు, అంగన్వాడి సెంటర్స్ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఎంఈఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పనులు చేపట్టేందుకు నిధులున్నా ఖర్చు చేయకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత పనులను వెంటనే చేపట్టి నిధుల వినియోగంపై నివేదికను అందజేయాలన్నారు. పెయింటింగ్ పనులు పూర్తిగా కాకుండా ప్రారంభోత్సవం చేయొద్దని ఆదేశించారు. చిన్న చిన్న పనులు ఉంటే పూర్తి చేసి స్థానిక ప్రజాప్రతినిదులతో ప్రారంభోత్సవం చేయడానికి సిద్ధం చేయాలన్నారు. సెప్టెంబర్ 25 నుండి నాడు నేడు పనులు పరిశీలించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎం బుక్, తీర్మానాలు, పేరెంట్స్ కమిటి సమావేశాలు, చెక్ పేమెంట్, తదితర రిజిస్టర్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో ఆర్. వెంకటరమణ, పంచాయతీరాజ్ ఎస్ఇ రామస్వామి, ఇంచార్జ్ మున్సిపల్ ఇంజనీర్ విజయ్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, డిఇలు, ఏఈలు, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై విస్తరణ అధికారులు

విశాలాంధ్ర-ఏలూరు : జిల్లాకు 9 మంది విస్తరణ అధికారులను పదోన్నతిపై కేటాయించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విస్తరణ అధికారులకు జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలు కేటాయించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలానికి సీ. హెచ్. శేఖర్, చాట్రాయికి మురళీకృష్ణ, భీమడోలుకు సుందరి, కలిదిండికి రాజారావు, ముదినేపల్లికి లక్ష్మీనారాయణ, కామవరపుకోటకి మరిడయ్య, కుక్కునూరుకి శివ నాగ నరసింహారావును కేటాయించారు. ఇంకా ఇద్దరు విస్తరణ అధికారులు జిల్లాకి రిపోర్ట్ చేయవలసి ఉంది. జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలకు విస్తరణ అధికారులను ప్రభుత్వం భర్తీ చేసిందని దీనివలన గ్రామాలలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రగతి ఉంటుందని డిపిఓ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల జీతాలు పెంచాలని పోస్టుకార్డు ఉద్యమం

విశాలాంధ్ర-టీ నరసాపురం: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు జీతాలు పెంచాలని పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్లు ఏలూరు జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సొంగా సిద్ధూ తెలిపారు. టీ నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు మంగళవారం పోస్టు కార్డుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధూ మాట్లాడుతూ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ లో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నేషనల్ హెల్త్ మిషన్ లో ఒక భాగమని తెలిపారు. మే నెలలో నేషనల్ హెల్త్ మిషన్ లో పని చేస్తున్న ఉద్యోగస్తులందరికి ప్రభుత్వం 22 శాతం జీతాలు పెంచి గత ఐదు సంవత్సరాలుగా వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు జీతాలు పెంచకపోవడం బాధాకరం అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు 22 శాతం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11 వ తేదీ నుండి పోస్ట్ కార్డు ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజనీ, ప్రభుత్వ సలహాదారు, చీఫ్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ కు పోస్ట్ కార్డు రాసి నిరసన తెలియజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రాజ్ చిన్ని,ఎస్ విజయ్,ఇ. ప్రసన్న, జి. రాజ్య లక్ష్మి,టి. శారద,బి. నవ్య,బి. నాగబాబు, కె. అనూష, ఎన్. ప్రియాంక, ఎన్. జగదాంబ, రెడ్డి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పర్వీన్‌కు పీహెచ్‌డీ

విశాలాంధ్ర - గణపవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్న షేక్ పర్వీన్ కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి పీహెచ్డీ పట్టా ప్రదానం చేసినట్లు శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి తెలిపారు. మంగళవారం పర్వీన్ కు అభినందన సభ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పర్వీన్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరయ్య పర్యవేక్షణలో ఎంతో కష్టపడి చదివి పరిశోధనలు చేసి "చేపల రసాయనిక క్రియలు ఎంజైముల పాత్ర" అనే అంశం మీద సిద్ధాంత గ్రంధాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్టు ఆమె తెలిపారు. పర్వీన్ చేసిన ఈ పరిశోధనలకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆమెకు పిహెచ్ డి ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు, డాక్టర్ టీ అక్కిరాజు, డాక్టర్ సిహెచ్ అనురాధ, డాక్టర్ జి. వెంకట్రావు, డాక్టర్ కె.స్వరూప రాణి, డాక్టర్ జి. వెంకటరమణ, డాక్టర్ సిహెచ్ చైతన్య, తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రతిపక్షాల అణచివేత

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలను అణచివేసే ప్రక్రియను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆయన మంత్రులు, శాసనసభ్యులు కొనసాగిస్తున్నారని జనసేన పార్టీ ఉభయ పశ్చిమగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏలూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో రెడ్డి అప్పలనాయుడు మీడియాతో మాట్లాడుతూ ఏలూరు శాసనసభ్యులు ఆళ్ళ నాని నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. గొల్లాయిగూడెం నుంచి కొత్తూరు వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా చెరువులను తలపించేలా పెద్ద పెద్ద గోతులు ఉంటే వాటిని పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఒబిలిశెట్టి శ్రావణ్ కుమార్, ఏలూరు నగర సహాయ కార్యదర్శి ఎట్రించి ధర్మేంద్ర, ప్రోగ్రాం కమిటీ సభ్యులు బొండా రాము నాయుడు, అధికార ప్రతి అల్లు సాయి చరణ్ తేజ్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మానుకొని, ప్రజా రంజక పాలన అందించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మండలంలో రాజవరం గ్రామంలో సిపిఐ శాఖా సమావేశం గ్రామ శాఖ కార్యదర్శి రేల నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. వారి స్వార్థం కోసం ప్రజా శ్రేయస్సును గాలికి వదిలేసారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్విస్ బ్యాంకులో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి పేదల ఖాతాలో జమ చేస్తానని మాయ మాటలు చెప్పి గద్దె ఎక్కిన తర్వాత మాట తప్పారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచడం వలన పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు విపరీతంగా నష్టపోయారని తెలిపారు. పేద, బల హీన వర్గాల ప్రజలకు సిపిఐ ఆధ్వర్యంలో పోడు భూములు, ఇళ్ల స్థలాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన పార్టీ సిపిఐ అని కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కె. వసంతరావు, సిపిఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి రమణ రాజు, కోన రాంబాబు, గాంధీ, వాగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం మండలం లోని రెడ్డి కొపల్లి గ్రామంలో సెలబ్రెల్ మలే రియాతో బాధపడుతున్న సిపిఐ బుట్టాయిగూడెం మండల కార్యదర్శి సోదెం వెంకటేశ్వరరావును చైతన్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా అనేకమంది గిరిజనులు విష జ్వరాల బారిన పడి అనారోగ్య పాలవుతున్నారన్నారు. రహదారులు అధ్వానంగా ఉండటంతో గిరిజనులు తమ గ్రామాల నుండి బయటకు వెళ్లి వైద్య సేవలు పొందటానికి నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు గిరిజన గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో శానిటైజేషన్ చేసి ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాట్లు చేసి గిరిజనులకు నాణ్యతతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. నిర్వాసిత గ్రామాల్లో బిక్కుబిక్కుమంటున్న నిర్వాసితులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసి ఆ ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. విషపూరితమైన సెలబ్రెల్ మలేరి యాతో బాధపడుతున్న సోదెంను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జేవీ రమణ రాజు, కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు ఉన్నారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగన్

విశాలాంధ్ర-చాట్రాయి: ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర దేశంలో ఎన్నడూ లేని విధంగా నిరు పేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ కే దక్కుతుందని పోలవరం పిఏస్ చైర్‌పర్సన్ చెలికాని బాబ్జి అన్నారు. మంగళవారం నూతనంగా మంజూరైన 21 పెన్షన్ల నగదును ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం గ్రామంలో ఇప్పటికే 740 మందికి రూ.20 లక్షల2వేల 9 వందలను ప్రతినెలా అందజేస్తున్నట్లు తెలిపారు. జగన్ చేస్తున్న సేవలను చిరకాలం గుర్తుంచుకోవాలని కోరారు.

రాజకీయకక్షతోనే అక్రమ కేసులు

విశాలాంధ్ర-తణుకు: ముఖ్యమంత్రి జగన్ రాజకీయ కక్షతోనే అక్రమంగా కేసులో ఇరికించి రిమాండ్ విధించే విధంగా సిఐడిని వాడుకున్నారని తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి ఎమ్మెల్యే రాధాకృష్ణ విమర్శించారు. రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుకు మనోధైర్యాన్ని కల్పించాలని రాధాకృష్ణ మంగళవారం పట్టణంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు అవినీతికి పాల్పడకుండా నిరంతరం ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసినటువంటి వ్యక్తి అన్నారు. చంద్రబాబు త్వరలో కడిగిన ఆణిముత్యంలా బయటికి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పరిమి వెంకన్న బాబు, తణుకు పట్టణ పార్టీ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, ఇరగవరం మండల పార్టీ అధ్యక్షులు గోపిశెట్టి రామకృష్ణ , తణుకు పట్టణ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రాంబాబు, తేతలి గ్రామ పార్టీ అధ్యక్షులు అద్దాడ శ్రీనివాసరాజు, నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు నల్ల భాస్కరరావు, కొమ్మిరెడ్డి ప్రభాకర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి తామర రమణమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ అధికారుల నియామకం

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాకు ఐదుగురు విస్తరణ అధికారులను పదోన్నతిపై నియమించినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఆదేశాలను అనుసరించి జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలలో ఐదు మంది విస్తరణ అధికారులకు ఉత్తర్వులను జారీ చేయడం జరిగిందన్నారు. మండలాల వారిగా భీమవరం జె.వెంకట నామేశ్వరరావు, తణుకు ఏ.ఎస్.ఆర్ కోటేశ్వరరావు, పాలకోడేరు కే.నాగేంద్ర కుమార్, ఆకివీడు కే.వెంకట సుబ్బారావు, వీరవాసరం టి.విజయ సారథి లను విస్తరణ అధికారులుగా పదోన్నత కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఆ ప్రకటనలో తెలిపారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి సర్. సి.ఆర్.ఆర్.పబ్లిక్ స్కూలులో బాలల సంరక్షణ , న్యాయ సహాయం అంశము పైన న్యాయ విజ్ఞాన సదస్సును మంగళ వారం నిర్వహించారు .ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని, వాటిని అమలు చేసే విధానంలో ఏమైనా లోపం జరిగిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని, బాలలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పైన యాజమాన్యాలు అవగాహన కలిగించాలన్నారు. బాలలకు ప్రాథమిక హక్కులు ప్రాథమిక విధులు, లీగల్ సర్వీసెస్ అందించే ఉచిత న్యాయ సహాయాల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ పి. వెంకటేశ్వరరావు స్కూల్ ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్, డైరెక్టర్ రాజకళ శ్రీదర్శి పాల్గొన్నారు.

ఓటర్ల ప్రత్యేక సవరణ పూర్తి స్థాయిలో చేపట్టాలి

విశాలాంధ్ర -ఏలూరు: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 సంబంధించి హౌస్ టు హౌస్ వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్స్ పంపిణీ , ఓటర్ల నమోదు, అభ్యంతరాల ధరఖాస్తుల తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్, ఇన్ చార్జి డిఆర్ఓ సూర్యనారాయణరెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గత వీడియో సమావేశంలో రాష్ట్ర ఎన్నికల అధికారి రివ్యూ చేసిన అంశాలపై జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన అంశాల గురించి చర్చించడం జరిగింది. ఏలూరు జిల్లాకు సంబంధించి జనవరి 6, 2022 వతేదీ నుంచి ఈ నెల 11వ తేదీ వరకు వచ్చిన డెత్, పోలింగ్ స్టేషన్ల షిఫ్టింగ్, రీవెరిఫికేషన్ చేయడం గురించి రాజకీయ పార్టీల వారు ఇచ్చిన ఫిర్యాదులు, నియమ విరుద్ధాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్స్ స్టేటస్, హౌస్ టు హౌస్ సర్వే యాక్షన్ ప్లాన్, ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, చేర్పులు, మార్పులు కొరకు దరఖాస్తులు, డబుల్ ఎంట్రీలు, తదితర అంశాలపై జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టి పూర్తిచేసిన నివేదికను వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 సూచించిన మార్గదర్శకాలను ఓటర్ల ప్రక్రియను నిర్వహించే ఇఆర్ఓలు, ఎలక్షన్ డిటిలు, బిఎల్ఓలు, రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఇచ్చిన మార్గదర్శకాలలో సూచించిన సమయానికి ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ పూర్తిస్థాయిలో చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్డీఓలు ఎస్.కె. ఖాజావలి, ఝాన్సీరాణి, జెడ్పి సిఇఓ రవికుమార్, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణమూర్తి, తహశీల్దార్ సోమశేఖర్, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరింటెండెంట్ చల్లన్న దొర, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారి తీరుపై ఆగ్రహం

ఆగడాలను అరికట్టాలని కోరుతున్న రైతులు, ప్రజలు

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో పని చేస్తున్న ఒక గ్రామ రెవెన్యూ అధికారి వ్యవహార తీరు తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఈయన వ్యవహార శైలిపై వ్యతిరేకత ఏర్పడి చర్చనీయాంశంగా మారింది. ఈ ఉద్యోగి పరిధిలోని రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఏదైనా పని చేయాలంటే ఈ ఉద్యోగి నిర్ణయించిన డబ్బు చెల్లించాల్సిందేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనుల కోసం వెళ్ళిన వారిని ఇంటి పనులకు వాడుకుంటున్నాడని వీరు పేర్కొంటున్నారు. సామాన్య స్థాయిలో ఉన్న వారంతా ఇంటి పనులు చేస్తేనే కరుణిస్తాడని, పనులు చేసి డబ్బులు ఇస్తేనే పని చేస్తాడని అంటున్నారు. రైతులు వ్యవసాయ బోర్లు వేసుకోవటానికి అనుమతి ఇవ్వాలంటే రూ. 10 వేల నుంచి రూ. 20 వేలు డిమాండు చేయటంతో సామాన్య రైతులు బావురుమంటున్నారు. ఈ ఉద్యోగి అడిగిన సొమ్ము పూర్తిగా చెల్లించకపోతే బోరు వేసుకునే సర్టిఫికెట్ ఇవ్వటంలేదని, డబ్బు తక్కువ ఇస్తే సాకులు చూపి సర్టిఫికెట్లు ఇవ్వకుండా నెలల తరబడి కాలయాపన చేస్తున్నాడని రైతులు వాపోతున్నారు. ఈ ఉద్యోగి తనకు వైసీపీకి చెందిన ఒక అగ్ర నేతలతో సంబంధాలు ఉన్నాయని, కాదంటే మీ పని అంతేనని బెదిరిస్తున్నాడని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. డబ్బు ఇచ్చేది తనకు ఒక్కడికే కాదని, రెవెన్యూ కార్యాలయంలో కింద స్థాయి నుంచి పైస్థాయి వరకు ఉన్న ఉద్యోగులకు డబ్బులు చెల్లించాలని చెబుతున్నాడని, అసలు కార్యాలయంలో ఈ ఉద్యోగి నుంచి డబ్బు తీసుకోరని పలువురు పేర్కొంటున్నారు. ఎందుకంటే తనకు పెద్ద నాయకుని అండ ఉందని చెప్పటంతో కార్యాలయపు ఉద్యోగులు, అధికారులు ఎటువంటి అడ్డంకులు పెట్టకుండా పనులు చేసి పంపేస్తారు. ఇక ఈ ఉద్యోగి ఎక్కువ రోజులు సెలవు పెట్టాలంటే డాక్టర్ సర్టిఫికెట్ సమర్పించాలి. అలా చేయకుండా ఒక రోజే లీవంటూ చెప్పుకుంటూ ఎక్కువ రోజులు లీవులోనే ఉంటాడని ఒక అధికారి వెల్లడించడం గమనార్హం. ఈ ఉద్యోగి ఉన్నతాధికారులు లింగపాలెం కార్యాలయానికి వచ్చినప్పుడు అతి వినయం చూపిస్తాడు. ఇది చూసిన సహచర గ్రామ రెవెన్యూ అధికారులు అవాక్కై ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ ఉద్యోగి గ్రామంలోని రైతుల వద్ద డిమాండు చేసిన డబ్బులు వ్యవహారాన్ని కొందరు ఫోన్లలో రికార్డుచేసి ఉంచారు. సమయం వచ్చినప్పుడు దీనిని వెల్లడిస్తామని అంటున్నారు. ఈ ఉద్యోగి ఆగడాలను నిరోధించకపోతే ఉన్నతాధికారులు అధికార పార్టీ నాయకునిపై ప్రజల్లో, రైతుల్లో వ్యతిరేకత ఉంటుందని అంటున్నారు. రాజకీయంగా పేరున్న గ్రామంలో పనిచేస్తున్న ఈ ఉద్యోగి వ్యవహార తీరు గ్రామానికి మచ్చగా ఉందని స్థానికంగా చెందిన పలువురు ఆరోపిస్తున్నారు.

వర్షంతో ఊరట.. గోతులతో సంకటం

విశాలాంధ్ర - లింగపాలెం : ఈనెలలో పడిన వర్షంతో రైతులు కాస్త ఊరట చెందుతున్నారు. లింగపాలెం మండలంలో 20 రోజులుపైబడి వర్షాలు లేక అలమటిస్తున్న రైతులు తుఫాను ప్రభావంతో ఈనెలలో ఇప్పటికి నాలుగు రోజుల పాటు పడిన 27 మి.మీ వర్షంతో వరి పంటలకు జీవం పోసినట్టుగా ఉందని రైతులు అంటున్నారు. పడిన వర్షం వల్ల కొన్ని రోజులపాటు ఇబ్బంది ఉండదనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ధర్మాజీగూడెం నుంచి చింతలపూడి ప్రధాన మార్గంలోని ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో హైస్కూలుకు వెళ్ళే సమీపంలో గుంటలు పడిన రహదారి చిందరవందరగా మారి సంకటంగా ఉంది. ఈ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉండటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాలలోని రహదారిని తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణీకులు వాపోతున్నారు.

మట్టి విగ్రహాలనే వాడదాం

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : మట్టి వినాయక విగ్రహాలనే వాడదాం.. పర్యావరణాన్ని కాపాడుదామంటూ విద్యార్థులతో త్యాగరాజ భవనం వీధుల్లో శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. సర్ సివి రామన్ స్కూల్ ప్రిన్సిపల్ చేకూరి పార్వతి మాట్లాడుతూ మట్టి కూడా బంగారమేనని, భూదేవిని పూజిస్తూ ఉంటానని, అటువంటి మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేసుకుని చవితి రోజున ప్రతి ఇంట్లో పూజలు చేసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు గాయత్రీ, సరిత మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల అనేక రోగాలు సంభవిస్తున్నాయని, ప్లాస్టిక్ పారిష్ తో తయారుచేసే విగ్రహాలను వాడవద్దని, ఆ విగ్రహాలను కాలువల్లో చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోను మా వంతు మట్టి విగ్రహాలను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. అనంతరం 40 మంది విద్యార్థులకు నడింపల్లి సుబ్బరాజు సహకారంతో విగ్రహాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఓటర్ల జాబితా

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 తయారీకి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజయవాడ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణకు సంబంధించి తొలగించబడిన ఓటర్ల జాబితా, ఇంటింటి వెరిఫికేషన్, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఈఓ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిఆర్ఓ కె.కృష్ణ వేణి, ఈఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం తొలగించబడిన ఓటర్ల జాబితా ఇంటింటి వెరిఫికేషన్ పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి వివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకుని దిశానిర్దేశం చేశారు. రాజకీయ పార్టీల సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలు పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఈ నెల 16 న రాష్ట్ర స్థాయిలో మొదటి ఎఫ్ఎల్సి నిర్వహణ వర్క్ షాప్ ఉంటుందని జిల్లా కలెక్టర్లతో పాటు ఒక సీనియర్ సూపర్వైజరీ అధికారి హాజరు కావాల్సి ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివరిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. 6 జనవరి 2022 నుండి తొలగింపు ఓటర్ల జాబితా రీ వెరిఫికేషన్ మేరకు చనిపోయిన వారు 33,277, పిఎస్ఈ, డిఎస్ఈ లు 29,833, వేరే ప్రాంతానికి వెళ్లిన వారు 15,458 మొత్తం 78,568 ఉన్నాయన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా జాయింటు కలెక్టరు ఎస్. రామ్ సుందర్ రెడ్డి, నరసాపురం నియోజక వర్గం ఇర్వో, జిల్లా రెవిన్యూ అధికారి కె కృష్ణవేణి,భీమవరం నియోజక వర్గం ఇర్వో, ఆర్డీవో దాసి రాజు,పాలకొల్లు నియోజక వర్గం ఇర్వో, డియల్డివో కెసిహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉండి మండలంలో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర- ఉండి : మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని బుధవారం ఉండి రూరల్ మండలంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉండి యంపిడివో కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం గం. 10లకు జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. జగన్నకు చెబుతాం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు, జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత మండల స్థాయి అధికారులు పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆ ప్రకటనలో తెలిపారు.

15న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) ఏలూరు జిల్లా సమితి సమావేశం ఈ నెల15 శుక్రవారం నాడు ఏలూరులో జరుగుతుందని బికెఎంయు ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు తెలిపారు. బికెఎంయు ఏలూరు జిల్లా సమితి సమావేశం ఈనెల 15 శుక్రవారం ఉదయం గం.10:30లకు ఏలూరులో సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరుగుతుందని తెలిపారు.సమావేశంలో బికెఎంయు 22వ రాష్ట్ర మహాసభలు బాపట్లలో ఈనెల 25,26,27వ తేదీలలో జరుగుతున్నాయని వాటిపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈనెల 25వ తేదీ బాపట్లలో జరుగు కూలి దండు మహా ప్రదర్శనకు, 26, 27 తేదీలలో జరుగు ప్రతినిధుల సభకు వెళ్లే కార్యకర్తలను ప్రతినిధులను జిల్లా సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. బికెయంయు జిల్లా సమితి సమావేశానికి జిల్లా సమితి సభ్యులు అందరూ హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

దాతల సహాయం అభినందనీయం

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థులకు దాతలు చేస్తున్న సహాయం అభినందనీయమని హెచ్ఎం అనిశెట్టి. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆరుతెగలపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టోర్నమెంట్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో పాఠశాల విద్యార్థులకు పూర్వపు విద్యార్థులు పడబుక్కల శేఖర్ బాబు, రాష్ట్ర విద్యార్థి సంఘాల అధ్యక్షులు జక్కుల విజయ్ కుమార్ రూ. 15 వేలు ఆర్థిక సహాయంతో 50 మంది పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సహాయం అందించిన ఇరువురిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఈటి లూయిస్, టి. శంకర్రావు, ఏ. రాజేంద్రప్రసాద్, ఎస్. మృత్యుంజయుడు, డి.వి నాగేశ్వరరావు, ఐ .రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సందర్భంగా మంగళవారం హైస్కూల్లో 150 మంది బాలికలను కంటి పరీక్షలు చేసినట్లు కంటి వైద్య అధికారి ఐ శ్రీనివాస్ తెలిపారు.వారికి పరీక్షలు చేయగా అందులో 21 మంది విద్యార్థులకు కళ్ళజోళ్ళు పడినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబు, హై స్కూల్ హెచ్ఎం బాల భాస్కర్, ఎం ఎల్ హెచ్ పి నున్న పాప, ఏ ఎన్ ఎం ఎం ప్రేమలీల, హెల్త్ అసిస్టెంట్లులు ఎమ్మెస్ యోహాన్, ఏ కృష్ణ, ఎం నల్లయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొనినారు.

రోజా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: చంద్రబాబు జోలికి రావటం సైకో జగన్ చేసిన అతి పెద్ద తప్పు అని, దీనికి సంబంధించి సంబరాలు చేసుకుంటున్న రోజా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మేఘలాదేవి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చరిత్ర ఏమిటి..? ఇన్ని కేసులు ఉన్నాయి వాటి వివరాలను బహిరంగంగా చెప్పగలవా అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి జగన్ పై పది సంవత్స రాలుగా ఉన్న కేసులు కనీసం వాద ప్రతి వాదనలకు కూడా రావడం లేదంటే జగన్ వ్యవస్థలను ఎంతగా మేనేజ్ చేస్తున్నారో అర్థమవుతుందన్నారు.

జగనన్నకు చెబుదాం వాయిదా

విశాలాంధ్ర -చింతలపూడి: జిల్లా కలెక్టర్ వారి అధ్యక్షతన జిల్లా స్థాయి అధికారులతో షెడ్యూల్ ప్రకారం ఈ నెల13 వ తేదీ బుధవారం చింతలపూడి మండలంలో నిర్వహించవలసిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనివార్య కారణాల వాయిదా పడినట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నేడొక ప్రకటన లో తెలిపారు.

కక్ష పూరితంగా కేసు నమోదు

విశాలాంధ్ర-ఆకివీడు : తెదేపాకి వస్తున్న ఆదరణ చూసి ముఖ్యమంత్రి జగన్ ఓర్వలేక టిడిపిపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు అన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు మచ్చలేని చంద్రుడులా తిరిగి రావాలని కోరుతూ మంగళవారం ఆకివీడు

శ్రీపెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానంలో టిడిపి శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ ప్రజలు మొత్తం గమనిస్తున్నారని. కచ్చితంగా రానున్న రోజుల్లో జగన్ ప్రభుత్వానికి చెక్ పెడతారన్నారు. 2024లో కచ్చితంగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోటుపల్లి రామ వరప్రసాద్, మాజీ సర్పంచ్ గొంట్ల గణపతి, బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, బొచ్చు సరళ కుమారి, కిమిడి అరుణకుమారి నాగరాజు, షేక్ చిన్నారి బీబి, బొల్లా వీర శ్వేత శేషు బాబు, దుబా సురేష్, ఇల్లాపు అప్పారావుతో పాటు పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : నోరు సంరక్షణ జాగ్రత్తలు అనే అంశంపై కరపత్రాలు పంపిణీతోపాటు అవగాహన సదస్సును పిఎస్ఎం గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులతో చిరుపవన్ తేజం సేవా సంస్థ అధ్వర్యంలో మంగళవారం నాచువారి సెంటర్ లో ర్యాలీ నిర్వహించారు. శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మానవ శరీరంలో అన్ని భాగాలు చాలా విలువ అయినవని,

ముఖ్యంగా నోరు ఆహారం తీసుకోవడం చేస్తూ ఉంటుందని, నాలుక అతి ప్రధానమైనదని అన్నారు. నోరును ఆరోగ్యంగా ఉంచుకోవడం మన బాధ్యత అని అన్నారు. సేవా సంస్థ అధ్యక్షులు ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 80% కంటే ఎక్కువ మంది ప్రజలు కొన్ని రకాల దంత సమస్యలను కలిగి ఉన్నారని, వారిలో ఎక్కువ మంది ఆ సమస్యలకు చికిత్స పొందడానికి నిరాకరిస్తున్నారని, మన నోటి ఆరోగ్యం కూడా మారిపోయిందని, మన దంత సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవడానికి మన అలవాట్లు, జీవనశైలిని గుర్తించడం అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వారణాసి రాధాకృష్ణ, పి. చిట్టి కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా రామారావు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా గారపాటి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జంగారెడ్డిగూడెం ఎన్.ఎం.యు అసోసియేషన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న గారపాటి రామారావు జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా పలువురు కార్మిక నాయకులు అభినందించారు. ఏలూరులో మంగళవారం జరిగిన నేషనల్ మజ్దూర్ యూనిటి

అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగిందని గారపాటి రామారావు తెలిపారు. జిల్లా చైర్మన్‌గా షేక్ ఇమామ్, కార్యదర్శిగా బి.ఎస్.రావు ఎన్నికైనట్లు తెలిపారు. ఆర్టీసీలో అతి పెద్ద అసోసియేషన్ గా ఉన్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కు ప్రభుత్వ గుర్తింపు లభించిందని రామారావు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని తెలిపారు. ఈ మేరకు సెక్రటేరియట్ లో మంగళవారం జీఎడి సర్వీసుల డిప్యూటి సెక్రెటరీ నాగమణి గుర్తింపు జీఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావుకు అందజేసారని తెలిపారు.

టీడీపీ రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జంగారెడ్డిగూడెం తెదేపా పట్టణ ఆధ్వర్యంలో స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా తెదేపా సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు మాట్లాడుతూ చంద్ర

బాబును అక్రమంగా అరెస్టు చేసి 14 రోజులు పాటు రిమాండ్ విధించడమే కాకుండా ఆయనపై మరిన్ని అక్రమ కేసులు పెట్టడానికి కుట్రపన్నడం సిగ్గుచేటన్నారు. ధైర్యంగా చంద్రబాబును, లోకేష్ ను ఎదుర్కోలేక పసలేని కేసులు పెడుతున్నారన్నారు. పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజల ద్వారా ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బొబ్బర రాజ్ పాల్ కుమార్, చెరుకూరి శ్రీధర్,మున్సిపల్ కౌన్సిలర్ తెలగారపు జ్యోతి, కాసాని ప్రసాద్,చేను ప్రసాద్,తదితరులు దీక్షలో కూర్చున్నారు.నాయకులు పెనుమర్తి రామ్ కుమార్,ఆకుమర్తి రామారావు,చక్రదేవర పల్లి సర్పంచ్ ,టీడీపీ మండల అధ్యక్షుడు,సాయిల సత్యనారాయణ, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి తూటిగుంట రాము తదితరులు మద్దతు తెలిపారు.

చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : సర్వీసులో ఉండి రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎం.గోవిందు హెచ్‌జి-1246 సతీమణి ఎం.దివ్యకి కాకినాడ జిల్లా డిప్యూటేషన్ హోం గార్డులు వారి ఒక రోజు వేతనం ద్వారా సమకూర్చిన 2,16,550 రూపాయల నగదు, అనారోగ్య కారణాలతో 25.07.2023న మరణించిన పి

.బాలకృష్ణ హెచ్‌జి 943 సతీమణి పి. వెంకట లక్ష్మికి ఫ్లాగ్ ఫండ్ నుండి సమకూరిన 10,000 రూపాయల నగదు చెక్కులను, కాకినాడ జిల్లా సాధారణ సర్వీసు హోంగార్డులు వారి ఒక రోజు వేతనం ద్వారా సమకూర్చిన 4,70,020 రూపాయల నగదు చెక్కును ది.18.04.2023న ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌జి-61 డి సుబ్రహ్మణ్యంకి, 4,59,370/- రూపాయల నగదు చెక్కును ది.04.05.2023న ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌జి- 220 సిహెచ్ అప్పారావుకి అదేవిధంగా డిప్యూటేషన్ హోంగార్డులు వారి ఒక రోజు వేతనం ద్వారా సమకూర్చిన 2,19,390 రూపాయల నగదు చెక్కును ది.31.12.2022న ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌జి-258 సిహెచ్ భాస్కరరావుకి 2,21,520 రూపాయల నగదు చెక్కును ది.19.01.2023న ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌జి-110 ఏ శ్రీనివాసరావుకి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో అడిషనల్ ఎస్పీ ఏఆర్ బి. సత్యనారాయణ, ఆర్ఐ హోంగార్డ్స్ వెంకట అప్పారావులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ రెడ్డి రాజ్యాంగం

విశాలాంధ్ర - జగ్గంపేట : అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రాష్ట్రంలో జగన్ రెడ్డి జగన్ రెడ్డి రాజ్యాంగం నడుస్తుందని రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా సెక్రటరీ ప్రేమ్ శివ నాగేశ్వరరావు గౌడ్ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసేందుకు వచ్చిన ఆయనను ఆర్పీ ఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ

పులి ప్రసాద్ జగ్గంపేటకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగ్గంపేట క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకున్నా చంద్రబాబును అరెస్టు చేయడం దారుణమన్నారు. ఆ అక్రమ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. ఆయనను కలిసేందుకు సైతం ఎవరిని అనుమతించడం లేదన్నారు. జగన్ రెడ్డి పాలనలో ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. బీటెక్ లాంటి చదువులు చదివి ఉద్యోగాలకు ఇతర రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సీఎం జగన్ దారి మళ్ళిస్తున్నారని, వాటిని సక్రమంగా విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో సాదే నరేంద్ర, సూరిబాబు పాల్గొన్నారు.

అన్‌క్లైమ్డ్ డిపాజిట్ల కోసం ఆర్బీఐ కొత్త పోర్టల్

కలెక్టర్ వె. ప్రసన్నవెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: అన్ క్లైయిమ్డ్ డిపాజిట్ల వివరాలు తెలుసుకోవడానికి ఉదగం పేరిట సెంట్రలైజ్డ్ వెబ్ పోర్టల్‌ను ఆర్బీఐ ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ వెల్లడించారు.మంగళవారం జరిగిన బ్యాంకర్ల సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2023-24 వార్షికరుణ ప్రణాళికను, చైతన్య గ్రామీణ చైతన్య బ్యాంకు వార్షిక నివేదికను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఉదగం పేరిట ప్రారంభించిన ఈ పోర్టల్ ద్వారా అన్ క్లైమ్డ్ మొత్తాలను కావాలంటే తీసుకోవడం లేదా ఆయా ఖాతాలను పునరుద్ధరించు కోవడానికి వీలవుతుందని చెప్పారు. ఏదైనా బ్యాంకు ఖాతాలోని నగదు 10 ఏళ్లు, లేదా అంతకుమించి వాడుకలో లేకపోతే దానిని అన్ క్లైయిమ్డ్ డిపాజిట్ గా పరిగణిస్తారన్నారు. అలా ఎవరూ క్లైమ్ చేయని డిపాజిట్లుగా ఆ సొమ్ము బ్యాంకుల్లోనే పేరుకు పోవడం జరుగుతుంద న్నారు. అటువంటి ఖాతాల వివరాలను ఆర్బీఐ ప్రవేశపెట్టిన పోర్టల్ ద్వారా చూసుకోవచ్చ

న్నారు. ఈ పోర్టల్ వలన ప్రజలు వారికి బ్యాంకుల వద్దఉన్న అన్ క్లైయిమ్డ్ డ్ డిపాజిట్ల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అక్టోబరు 15 లోగా మిగిలిన బ్యాంకుల్లో అన్ క్లైయిమ్డ్ డ్ డిపాజిట్ల వివరాలు కూడా ఉదగం పోర్టల్ లో అందుబాటులోకి వస్తాయన్నారు. కౌలు రైతులకు ఉదార స్వభావంతో రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాడాలని బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. సిసిఆర్ సి కార్డులు కలిగిన కౌలు రైతులకు బ్యాంకర్లు రుణాలు అందించిన తీరు అసంతృప్తిగా ఉందన్నారు. డిసిసి కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ యం. గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ 2023-24 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ. 16 వేల 260కోట్లు కాగా వ్యవసా యానికి రూ. 11,411 కోట్లు కేటాయించగా ఇందులో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలకు రూ. 6,648 కోట్లు, స్వల్ప, మధ్యతరహా పరిశ్రమలకు రూ. 2,058 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ. 981 కోట్లు, కేటాయించడంజరిగిందన్నారు. ప్రాధన్యేతర రంగాలకు రూ. 1806 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు కింద రూ. 1974 కోట్లు అందించడం జరిగిందన్నారు. ద్వాక్రా మహిళలకు, ప్రధానమంత్రి స్వానిధి, ప్రాధాన్యతా రంగాలకు, అందించిన రుణాల వివరాలను ఆయన వివరించారు. ఈ సమావేశంలో డిసిసి కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ యం. గోపాలకృష్ణమూర్తి , రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్ డిఓ పూర్ణిమా, ఎల్ డిఎం డి. నీలాద్రి, నాబార్డ్ డిడిఎం అనిల్ కాంత్, పశు సంవర్ధకశాఖ జెడి జి. నెహ్రూబాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజరు పి. ఏసుదాసు, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎస్.ఎస్. కృపావరం, వివిధ బ్యాంకుల కంట్రోలర్ లు, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్ బుక్ మంజూరు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్తిపాడు తహశీల్దార్ తన భూమికి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేశారని రైతు సత్తి వినోద్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళగిరిలోని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ చీఫ్ కమీషనర్‌కి వినతి పత్రాన్ని అందజేశాన్ని తెలిపారు. తనకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని ఇ గోకవరంలో కూచుమంచి సుబ్రహ్మణ్యం వద్ద సర్వే నంబర్ 195/2లో 25 ఎకరాల భూమిలో 10.26 ఎకరాల

భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమి పెద్దిపాలెం గ్రామానికి చెందిన చింతాకుల వీరరాఘవరావు (కౌలుదారుడు) స్వాధీనంలో ఉండేది. ప్రస్తుతం ఆయన ఈ భూమిపై తనకు ఏవిధమైన హక్కులేదని లిఖిత పూర్వకంగా ధృవీకరిస్తూ కూచుమంచి ఉమామహేశ్వరరావుకి భూమిని అప్పగించారని, ఈ భూమి నిమిత్తం పలు కోర్టులలో తనకు అనుకూలంగా తీర్పు వచ్చినట్లు ఆయన తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్డీవో సిఫార్సుతో తనకు విచారణ అనంతరం రికార్డు ప్రకారం ప్రత్తిపాడు తహశీల్ధార్ పివివి గోపాలకృష్ణ తనకు పట్టాదారు పాస్ బుక్ మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. ఈ భూమికి ఎటువంటి సంబంధంలేని పెద్దిపాలెంకు చెందిన చింతాకుల భాస్కరరావు (రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి), తహశీల్ధార్ కార్యాలయంలోని కొంత మంది ఉద్యోగులు మీకు పాస్ బుక్ మంజూరు చేసిన తహశీల్దార్ సస్పెండ్ అయ్యారని, మీ భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించి మీ పాస్ బుక్, 1బీ రద్దు చేస్తామని తనను బెదిరిస్తున్నట్లు వినోద్ కుమార్ రెడ్డి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ చీఫ్ కమీషనర్‌కి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

విశాలాంధ్ర.-ఉండి : కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండాలని ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరించి తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయించారని కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారన్నారు. వేలాదిమంది యువతకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇవ్వడంతో ఉపాధి పొందారని ఆయన గుర్తు చేశారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో అజేయకల్లం, ప్రేమ్ చంద్ర రెడ్డి వంటి అధికారులను ఎందుకు విచారించలేదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గుజరాత్లో శిక్షణ ఇచ్చిన అదే సంస్థకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ అధికారుల్లో ఉన్న సమయంలో కట్టబెట్టామని అన్నారు. ఇటువంటి ఇబ్బందులను కుట్రలను తెలుగుదేశం పార్టీ ఎన్నో ఎదుర్కొందని కానీ నాయకులు కార్యకర్తలు ధైర్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేశారని ఇప్పుడు కూడా అదే విధంగా ధైర్యంగా ఉండాలని కార్యకర్తలకు నాయకులకు ఉండి మాజీ ఎమ్మెల్యే శివరామరాజు సూచించారు.

కిర్లపూడిలో నా భూమి- నా దేశం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లపూడి మండల పరిధిలోని జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి బూత్ నెంబర్లు గల 226, 227, 228 గ్రామాల్లో మంగళవారం మండల అధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో నా భూమి నాదేశం

కార్యక్రమం నిర్వహించారు. భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సంకల్పించిన నా భూమి, నాదేశం కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు వివరిస్తూ ప్రతీ ఇంటి నుంచి మట్టి సేకరించారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దొడ్డా అప్పారావు, మండల మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కాళింగి రాఘవమ్మ, పలువురు భారత భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ప్రజల ఆరోగ్య పట్ల అవగాహన కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని నాగులపల్లి వైద్యాధికారి ఎస్. సౌజన్య అన్నారు. మూలపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఏర్పాటు

చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలను సమావేశపరచి వారికి పౌష్టిక ఆహారం, ఆరోగ్య అభివృద్ధి కోసం హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారావు కౌన్సిలింగ్ నిర్వహించారు. డాక్టర్ శ్యామల పలువురును పరీక్షలు నిర్వహించి మందులు అందించి అనంతరం స్థానిక జడ్పి పిపి హైస్కూల్ సందర్శించి బాలికలకు, బాలురుకు విడివిడిగా ఆరోగ్య విద్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వివాహాల వయసు పై బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను మొదలగు విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు

విశాలాంధ్ర - కరప : కరప మండలానికి కొత్తగా 299 పింఛన్లు మంజూరు చేసినట్టు మండల అభివృద్ధి అధికారి కే అప్పారావు తెలిపారు. ఈ పింఛన్లను గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కాకినాడ రూరల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి వర్యులు కురసాల కన్నబాబు చేతుల మీదుగా ఆయా పించనుదారులకు అందించడం జరుగుతుందని ఎంపీడీవో అప్పారావు తెలిపారు.

ఒకే కుటుంబంలో మూడు తరాల మహిళలకు అరుదైన రికార్డు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరానికి చెందిన ఒకే కుటుంబంలో మూడు తరాల మహిళలు అమ్మ, కూతురు మనవరాల. లేస్ వర్క్‌లో పోన్చేస్ తయారు చేసి మొదటిసారి గిన్నిస్ అవార్డు దక్కించుకున్నారు. కాకినాడకు చెందిన సోల్లంగి మహాలక్ష్మి ఈమె కుమార్తె డొంక వీర సోమేశ్వరి దేవి. ఈమె కుమార్తె ప్రియాన్సీ. ఈ ముగ్గురు ఈ వర్క్‌లో కనబరిచిన ప్రతిభను గుర్తించిన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ నమోదు చేసి వీరికి గుర్తింపు పత్రాన్ని అందజేసినట్లు మహాలక్ష్మి

తెలియజేశారు. మహిళ మనోవికాస్ వ్యవస్థాపకురాలు మాధవి నేతృత్వంలో 250 మంది గృహిణులు ఆరు నెలల్లో 2719 క్రంచీట్ ప్రొంచెస్ మహిళలు ధరించే వస్త్రం నూలుతో తయారు చేసి ఈ రికార్డు సాధించారు. విశాఖపట్నం నగరంలో అక్కయ్యపాలెంలో వీటి ప్రదర్శన నిర్వహించాలని ఈ సందర్భంగా ఎంపికైన వారికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధి స్వప్నిల్ డగారికల్ పరిశీలించి లార్జెస్ట్ డిస్ప్లే ఆఫ్ శాంచర్స్ ప్రోంచెస్‌గా ధ్రువీకరించి రికార్డును అందజేయనున్నట్టు ఆమె తెలిపారు. వీటిని గిరిజన ప్రాంతాల్లో మహిళలకు ఉచితంగా అందజేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు.

ఆమరణదీక్ష విరమించిన జాలెం సుబ్బారావు

విశాలాంధ్ర - మామిడికుదురు : తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు సోమవారం రాత్రి జాలెం సుబ్బారావు ఆమరణ నిరాహారదీక్షను విరమించారు. పార్టీ అధిష్ఠానం నుండి అచ్చెన్నాయుడు

జాలెం సుబ్బారావుకు ఫోన్‌చేసి ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ దృష్ట్యా జాలెం సుబ్బారావును దీక్ష విరమించాలని అచ్చెన్నాయుడు కోరారు. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు పి గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మాజీ జెడ్పి చైర్మన్ నామన రాంబాబు, జాలెం సుబ్బారావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. తన దీక్షకు అన్నివిధాలా సహకరించిన పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గాదేవి ఆలయంలో పూజలు

విశాలాంధ్ర-దేవరపల్లి: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విడుదలై తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరుతూ దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో దుర్గాదేవి ఆలయంలో మంగళవారం నాడు తెలుగుదేశం నేతలు

పూజలు నిర్వహించారు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు దేవరపల్లి మండల సీనియర్ తెలుగుదేశం నాయకుడు సుంకర దుర్గారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు నాయుడు పై అక్రమంగా కేసు బనాయించిందని విమర్శించారు ఈ కేసులో చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యం లాగా బయటకు వస్తారని అన్నారు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ క్యాడర్ అంతా నారా కుటుంబానికి వెనక నుండి పనిచేస్తుంది అన్నారు ఈ పూజా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు చింతల దాసు, నల్లమాటి నాగేశ్వరరావు, అక్కా బత్తుల వెంకటరమణ, తాళ్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రోజాపై మండిపడ్డ శ్రీధర్

విశాలాంధ్ర - పిఠాపురం టౌన్ : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను మంత్రి రోజా తిడితే చూస్తూ ఊరుకోబోమని, మంత్రి రోజా నోరు అదుపులో పెట్టుకోవాలని పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకుడు డాక్టర్ పిల్లా

శ్రీధర్ మంత్రి రోజాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పిఠాపురంలో మీడియా సమావేశంలో డాక్టర్ పిల్లా శ్రీధర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంత్రి రోజాకి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు.

ఆలయ అభివృద్ధికి భూమి పూజ

విశాలాంధ్ర - ఆలమూరు : ఉభయగోదావరి జిల్లాల్లో చంటిపిల్లల తల్లిగా ప్రసిద్ధిగాంచిన చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుండి సిజిఎఫ్ మాచింగ్ నిధులు 1 కోటి 60 లక్షల రూపాయలు మంజూరు చేయించుకోవడం జరిగింది అని బీసీ సంక్షేమ శాఖా మరియు ఐ అండ్ పిఆర్ మంత్రివర్యులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలమూరు మండలం చింతలూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయం ప్రతీ ఏటా జరిగే జాతర మరియు తీర్థ మహోత్సవాలలో సుమారు 5,00,000 మంది దర్శించుకుంటారని, అంతటి మహిమగల అమ్మవారి ఆలయం నందు ప్రాకార మండపం నిర్మాణం మరియు ముఖమండపం పునర్నిర్మాణానికి 1కోటి రూపాయలు సిజిఎఫ్ నిధులు మరియు 60 లక్షల దేవస్థానం నిధులు విడుదల చేయించుకోవడం శుభపరిణామం అన్నారు.

సత్యగిరి శివ సదన్ వద్ద ప్రమాదం

అనవాళ్లు లేకుండా అధికారుల ప్రయత్నం

విశాలాంధ్ర - అన్నవరం : అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర ఆజాద్ ఒత్తిడి వల్లే ఓ యువకుడు ప్రమాదానికి కారణమని ఆరోపణలు వినబడుతున్నాయి. సత్యగిరి కొండ శివసదన్ కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో సోమవారం రాత్రి ప్రమాదం జరుగగా హుటాహుటిన 108 వాహనం ద్వారా కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా కొన ఊపిరితో కొట్టిమిట్టాడుతున్నాడు. కాకినాడ జిల్లా అన్నవరం సత్యగిరి కొండపై సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగిన సంఘటనలో దినసరి కూలి చేసుకుంటున్న సుబ్బు అనే ఓ యువకుడు తీవ్రంగా గాయపడి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే అన్నవరం శ్రీ వీర వెంకట

సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం పరిధిలో 2018లో శంకుస్థాపన చేసిన సత్యగిరి కొండపై 138 వసతి గదులతో కూడిన శివ సదన్ కొరకు నిర్మాణ పనులు చేపట్టారు. ఐదు సంవత్సరాలుగా నత్త నడక నడుస్తుండగా ఇటీవల వర్క్ అరేంజ్మెంట్ ఆర్డర్లో ఈవోగా జాయిన్ అయిన చంద్రశేఖర్ ఆజాద్ పనులు సకాలంలో పూర్తి చేయాలని లేని పక్షంలో ఇంజనీరింగ్ అధికారులను సస్పెండ్ చేయవలసి ఉంటుందని హెచ్చరించడం జరిగింది. ఈవో హెచ్చరికలతో కాంట్రాక్టర్‌దే బాధ్యత అయినా అన్ని విభాగాల అధికారులు ఆగ మేఘాల మీద ఎక్కడ సస్పెండ్ అవుతామో అన్న భయంతో పనులు చురుగ్గా చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అధికారుల సమక్షంలో సుమారు రెండు టన్నుల బరువు ఉండే కరెంటు ప్యానెల్ బోర్డును అవగాహన లేకుండా ఈవో ఒత్తిడికి తల వొగ్గి క్రేన్ ద్వారా దించు సందర్భంలో దేవస్థానంలో వాటర్ వర్క్స్ విభాగంలో దినసరి కూలీ చేస్తున్న సుబ్బు అనే యువకుడి పై ప్యానెల్ బోర్డు జారి పడడంతో కాలుకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన యువకుడిని హుటాహుటిన కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా చికిత్సపొందుతున్నట్లు బంధు వర్గీయులు తెలిపారు. ప్రస్తుతం అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు సమాచారం.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ దేవరపల్లి మండల శాఖసమావేశం పప్పు వెంకట రామా రావు అధ్యక్షతన దేవరపల్లి విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగింది.

అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ సెప్టెంబర్ 24, 25 తేదీల్లో కాకినాడలో రాష్ట్ర మహాసభలు, రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికలు జరుగుతాయని జయప్రదం కావాలని కోరారు. జిల్లా, మండల కార్యదర్శి బండి సూర్య ప్రకాశ రావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ఐక్య పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతాయని అన్నారు. ఇంతవరకు 11వ పిఆర్సి బకాయిలు, డి ఆర్ బకాయలు ప్రభుత్వం చెల్లించలేదని, విశ్రాంత ఉద్యోగులు అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఎంతో బాధపడుతున్నారని, ప్రభుత్వం సానుభూతితో స్పందించి విశ్రాంత ఉద్యోగులకు రావలసిన బకాయిలు వెంటనే ఒకే దఫాగా నగదు రూపంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవఅధ్యక్షులు కేశిరాజు సీతారామయ్య అసోసియేట్ అధ్యక్షులు సయ్యద్ అలీ ఉపాధ్యక్షులు ఈడుపుగంటి నాగేశ్వరరావు, వెలిచెర్ల సూర్య నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడి అరెస్టు అక్రమం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నడూ జరగని పరిణామాలు జరుగుతున్నాయని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు అమానుషమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘోరమైన నీచమైన ఆగడాలు జరుగుతున్నాయని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయాన్ని భ్రష్టు

పట్టిస్తూ అవగాహన లేని పరిపాలన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేసే క్రూరమైన పనులను రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు నిశితంగా పరిశీలిస్తున్నా రన్నారు. 2024లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యి ఒకటికి రెండింతలు తిరిగి ఇచ్చేస్తారని ఆదిరెడ్డి అప్పారావు హెచ్చరించారు.

కొత్త పెన్షన్ల అందజేత

విశాలాంధ్ర - ఉంద్రాజవరం: అర్హత ప్రామాణికంగా అర్జీదారులందరికీ, ప్రభుత్వ పెన్షన్లు అందజేయడం జరుగుతుందన్నారు సూర్యారావు పాలెం గ్రామ సర్పంచ్ మెండే లలిత కుమారి. మంగళవారం కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇటీవల వికలాంగులకు 8, వితంతువులకు 7, వృద్ధాప్య పింఛన్లు మొత్తం 24 మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నందిన శ్రీనివాసరావు, పెదపోలు వెంకటేశ్వరరావు, దుద్దుపూడి కాశీ విశ్వనాథం, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎన్.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్టు న్యాయమైనదే

విశాలాంధ్ర - ముమ్మిడివరం : నారా చంద్రబాబు అరెస్ట్ న్యాయమైనదేనని వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బదుగు శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా మాదిగ సామాజిక వర్గానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదని, ఉన్నతమైన రాజకీయ పదవులు మాదిగలకు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని అన్నారు. అలాంటి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మంద కృష్ణ మాదిగ విమర్శించడం తగదని వచ్చే ఎన్నికలలో మళ్ళీ నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని

చేయడానికిప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి పీఠం ఎక్కించటానికి శక్తి వంచన లేకుండా మాదిగ సామాజిక వర్గం కృషి చేస్తూనే ఉంటుందని అన్నారు.

చంద్రబాబుపై ఆరోపణలు మానుకోవాలి

విశాలాంధ్ర - పిఠాపురం సిటీ : నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ప్రజలు స్వచ్ఛందంగా బందు పాటిస్తే బంద్ ప్రభావం ఏమీ లేదని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అనడం విడ్డూరంగా ఉందని కురసాల కన్నబాబు నారా చంద్రబాబు నాయుడు పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే వర్మ హితవు పలికారు. పిఠాపురం మహారాజ కోట ఆవరణలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వర్మ పాత్రికేయులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో అధికారులను ఎందుకు అరెస్టు చేయలేదని మాజీ మంత్రి కురసాల కన్నబాబును ఈ సందర్భంగా వర్మ నిలదీశారు. గుజరాత్‌లో పెట్టిన సీమెన్ సాఫ్ట్ వేరు, డిజైన్ టెక్ సంస్థలు అదే షరతులతో ఏపీలో నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పరచి, 2లక్షల 13 వేల మందికి 42 కేంద్రాలలో శిక్షణ ఇచ్చి, 75వేల మందికి ఉద్యోగాలు కలిపించారు చంద్రబాబు నాయుడు అన్నారు. ఇందులో కుంభకోణం ఎక్కడిదని ప్రశ్నించారు. అసలు నైపుణ్య కేంద్రాలు చూడకుండా అందులో గల స్కిల్ చూడకుండా, సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ లెక్కించుకుండా 241 కోట్లు అవినీతి అని ఎలా అంటారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డం భాస్కర రావు, కొండేపూడి సూర్యప్రకాష్, పిల్లి చిన్న, కోరుప్రోలు శ్రీను, సోము సత్యనారాయణ, కోళ్ళ బంగారు బాబు, వేనుం సురేష్, ఆలం దొరబాబు, బెజవాడ సురేష్, నెక్కల సత్యనారాయణ, వరద సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ పాత్రికేయులు సమావేశంలో రెడ్డెం భాస్కర్ రావు, కొండేపూడి ప్రకాష్, పిల్లి చిన్న, నల్ల శ్రీను, సోము సత్తిబాబు, కోళ్ల బంగారుబాబు, వేణు సురేష్, దొరబాబు, వరద సత్తిబాబు, సీరం భద్రరావు, నెక్కల సత్యనారాయణ, రాపర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.